www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 29 ఏప్రిల్ 2024 8 పేజీలు

ఏలూరు పశ్చిమ గోదావరి

బుజ్జగింపులు.. ప్రలోభాలు..!

నేడు నామినేషన్ల విత్‌డ్రాల పర్వం

రెబల్స్, ఇండిపెండెంట్లను దారికి తెచ్చుకునేందుకు యత్నం

నూజివీడులో టిడిపి రెబల్ ముద్రబోయిన దారికొచ్చినట్లు సమాచారం

ఉండిలో ససేమీరా అంటున్న శివరామరాజు

బరిలో నిలిచే అభ్యర్థుల జాబితా తేలేది నేడే

నామినేషన్లు విత్‌డ్రా చేసుకునేలా ఇండిపెండెంట్లు, రెబల్ అభ్యర్థులను బుజ్జగించి దారికి తెచ్చుకునేందుకు ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు నానా తంటాలు పడుతున్నారు. వెనక్కితగ్గేలా చేసేందుకు ప్రలోభాల ఎరవేస్తున్నట్లు సమాచారం.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏప్రిల్ 18 నుంచి 25వ తేదీ వరకూ నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. 26వ తేదీన నామినేషన్ల పరిశీలనలో పశ్చిమగోదావరి జిల్లాలో ఎంపీ స్థానంలో ఆరు, అసెంబ్లీ స్థానాల్లో 23 నామినేషన్లు, ఏలూరు జిల్లాలో ఎంపీ స్థానంలో నాలుగు, ఎంఎల్ఎ స్థానాల్లో 26 మొత్తం 59 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. నరసాపురం ఎంపీ బరిలో 21 మంది, పశ్చిమలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో 99 మంది మిగిలారు. ఏలూరు జిల్లాలోని ఎంపీ స్థానంలో 13 మంది, ఏడు అసెంబ్లీ స్థానాల్లో 97 మంది మిగిలారు. 29వ తేదీ సోమవారం నామినేషన్ల విత్‌డ్రాలు కొనసాగనున్నాయి. ఈ రోజు విత్‌డ్రా కాకపోతే ఎన్నికల బరిలో ఉండే అవకాశం ఉంటుంది. దీంతో ప్రతి నియోజవకర్గంలోనూ ప్రధాన పార్టీలైన టిడిపి కూటమి, వైసిపి, కాంగ్రెస్ అభ్యర్థులు కాకుండా మిగిలిన అభ్యర్థుల సంఖ్య ఎక్కువగానే ఉంది. ఉండి, నూజివీడు నియోజకవర్గాల్లో టిడిపి నుంచి రెబల్ అభ్యర్థులు నామినేషన్ వేశారు. ఉండిలో మాజీ ఎంఎల్ఎ వేటుకూరి శివరామరాజు, నూజివీడులో టిడిపి నుంచి టిక్కెట్ ఆశించి భంగపడిన ముద్రబోయిన వెంకటేశ్వరరావు నామినేషన్ దాఖలు చేసి పరిశీలన కూడా పూర్తిచేసుకున్నారు. ఈ రెండు చోట్లా టిడిపి ఓట్లు చీలే అవకాశం ఉండడంతో టిడిపి జిల్లా, రాష్ట్ర నాయకత్వం బుజ్జిగింపుల పర్వం కొనసాగిస్తోంది. నూజివీడు టిడిపి రెబల్ అభ్యర్థి ముద్రబోయిన వెంకటేశ్వరరావు మెత్తబడి వెనక్కితగ్గేందుకు ఒప్పుకున్నట్లు సమాచారం. దీంతో ఇక్కడ టిడిపికి రెబల్ బెడద తప్పినట్లుగా తెలుస్తోంది. ఉండిలో మాత్రం శివరామరాజు వెనక్కి తగ్గేందుకు ఒప్పుకోవడం లేదని తెలుస్తోంది. దీంతో సమస్యను ఎలా ఎదుర్కొంటారా చూడాల్సి ఉంది. అంతేకాకుండా నరసాపురం నియోజకవర్గంలో జనసేన అభ్యర్థిగా బొమ్మిడి నాయకర్ బరిలో ఉన్నారు. అదేపేరుతో ఉన్న మరో నలుగురు నామినేషన్ వేసిన పరిస్థితి ఉంది. ఓటర్లు పేర్లు చూసి పొరపాటు పడే అవకాశం ఉందని భావించి వారిని దారిలోకి తెచ్చుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. ఉంగుటూరు నియోజకవర్గంలో జనసేన అభ్యర్థిగా పత్సమట్ల ధర్మరాజు బరిలో ఉన్నారు. అదే పేరుగల మరో వ్యక్తి నామినేషన్ వేశారు. అంతేకాకుండా ఎస్‌సి, బిసి తరగతికి చెందిన కొంతమంది నాయకులు ఇండిపెండెంట్‌గా నామినేషన్లు వేసిన పరిస్థితి నెలకొంది. కనీసంగా తమ సామాజిక తరగతి నుంచి ఎన్నో కొన్ని ఓట్లు చీలే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ నువ్వా నేనా అన్నట్లు టిడిపి కూటమి, వైసిపి మధ్య ఎన్నికల పోరు కొనసాగుతోంది. దీంతో ప్రతి ఓటూ కాపాడుకోవాలని ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు భావిస్తున్నారు. తమకు ఇబ్బంది కలిగించే ఇండిపెండెంట్ అభ్యర్థులు వారి నామినేషన్లను విత్‌డ్రా చేసుకునేవిధంగా చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. అందుకోసం ప్రలోభాలకు తెరలేపినట్లు సైతం తెలుస్తోంది. 29వ తేదీ సాయంత్రానికి విత్‌డ్రా చేసుకోకపోతే ..6లో

భానుడి భగభగ..

ఎండ తీవ్రతకు విలవిల్లాడుతున్న జనం

శీతల పానీయాలవైపు పరుగులు

ప్రజాశక్తి - ఆచంట

భానుడు భగభగ మండి పోతున్నాడు.. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు జనం విలవిల్లాడిపోతున్నారు. బయటకు రావాలేంటేనే భయపడిపోతున్నారు. ఇక ప్రయాణికుల పరిస్థితి వర్ణణాతీతం. ఉదయం 10 గంటల నుంచి ఎండ ప్రచండంగా మారుతోంది. మధ్యాహ్నం అయ్యే సరికి బానుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడే రహదారులు, ప్రధాన కూడళ్లు 12 గంటల నుంచి నిర్మానుష్యంగా మారుతున్నాయి. వ్యాపారులు సైతం మధ్యాహ్నం దుకాణాలు మూసివేసి తిరిగి సాయంత్రం 5 గంటలకు తెరుస్తున్నారు. ఎండతోపాటు ఉక్కబోతగా ఉండడంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసరమైతే తప్ప ప్రయాణికులు ఉదయం, సాయంత్ర వేళల్లో మాత్రమే ప్రయాణాలు సాగిస్తున్నారు. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు జనం చల్లని పానీయాలవైపు పరుగులు

తీస్తున్నారు. ఎండల నేపథ్యంలో శీతల పానీయాలు, కొబ్బరిబొండాల ధరలకు రెక్కలొచ్చాయి. నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే ప్రభుత్వ కార్యాలయాలు సైతం మధ్యాహ్నవేళ బోసిపోతున్నాయి. బేరాలు లేక వాపారులు దుకాణాలను మూసివేస్తున్నారు. ఏప్రిల్ మొదటి వారంలోనే పరిస్థితి ఇలాఉంటే ముందుముందు వేసవి తాపం ..6లో

నిర్మానుష్యంగా మారిన ఆచంట - కోడేరు ఆర్అండ్‌బి రహదారి

నామినేషన్ల ఉపసంహరణ తరువాత చర్యలు వేగవంతం

జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్

ప్రజాశక్తి - భీమవరం

నామినేషన్ల ఉప సంహరణ అనంతరం నిర్వహించే ప్రక్రియకు వేగవంతంగా చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో నామినేషన్లు ఉపసంహరణ అనంతరం చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. సోమవారం మధ్యాహ్నం మూడు గంటల వరకూ నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థులకు (గుర్తులు కేటాయించాల్సిన అభ్యర్థులకు) గుర్తులు కేటాయింపు చేసి వెంటనే తెలియజేయాలన్నారు. అభ్యర్థుల పేర్లను ప్రామాణికంగా తెలుగు వర్ణమాల ప్రకారం బ్యాలెట్‌లో పొందుపర్చడానికి వరుసక్రమాన్ని నిర్ణయించాలన్నారు. అభ్యర్థులు వారి పేరును బ్యాలెట్ పేపర్లో ఏ విధంగా ఉండాలో వారు సూచించిన విధంగా ఆప్షన్ తీసుకుని నమోదు చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ పేపర్ ముద్రణ, సర్వీస్ ఓటర్ల కోసం ఎలక్ట్రానికల్లీ ట్రాన్స్మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టం (ఇటిపిబిఎస్) ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎటువంటి వివాదాలకు తావులేని విధంగా ..6లో

అక్షర క్రమంలో ముందు.. అభివృద్ధిలో వెనుక

మధ్యపేజీల్లో..

వినయం, క్రమశిక్షణ విజయానికి మూలం

8లో..

రామకృష్ణంరాజు మాస్టారు సేవలు ఎనలేనివి

8లో..

పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మే 1వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగింపు

జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల కమిషన్ పోస్టల్ బ్యాలెట్ గడువును మే 1వ తేదీ వరకూ పొడిగించిందని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని ఎన్నికల కమిషన్ మే 1వ తేదీ వరకూ పొడిగించిన దృష్ట్యా ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాల్లో సిబ్బంది కొరత దృష్ట్యా నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల విధుల్లోకి అంగన్‌వాడీలు, కాంట్రాక్టు ఉద్యోగులను ఒపిఒలుగా నియమించేందుకు ఇసి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఉద్యోగి ఏ జిల్లాలో, ఏ నియోజకవర్గంలో ఓటరుగా నమోదైనా తాను విధులు నిర్వర్తిస్తున్న ప్రాంతంలోని ఫెసిలిటేషన్ సెంటర్లో తమ ఓటు హక్కును

వినియోగించుకోవచ్చన్నారు. ఎన్నికల విధుల్లో ఉండే సిబ్బందికి పోలింగ్ రోజు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉండదని, వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించడం జరిగిందని, ప్రత్యేకంగా దరఖాస్తు చేసు కోవాలని తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు పోలింగ్ కంటే ముందుగానే ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవడం జరుగుతుందన్నారు. దీని కోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎన్నికల విధుల్లో ఉండే అధికారులు, సిబ్బంది, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ ఆఫీసర్స్, ..6లో

అవార్డు అందుకుంటున్న అరవింద్ జాల

నటుడు అరవింద్‌కు ఉగాది పురస్కారం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు జిల్లాకు చెందిన సినిమా యాక్టర్ అరవింద్ జాల ఇటీవల విడుదలైన అనన్య సినిమాలో మెయిన్ విలన్ గా నటించినందుకు గాను తెలుగు సినిమా ఉగాది అవార్డ్స్ పురస్కారంలో భాగంగా అవార్డు వచ్చింది. అనన్య సినిమా ద్వారా విలన్‌గా పరిచయమై, ఎందరో హృదయాల్లో చోటు సంపాదించుకొని తనదైన శైలిలో అద్భుతంగా నటించాడని, ఆదివారం హైదరాబాద్‌లో జరుగుతున్న ఉగాది పురస్కారాల్లో అవార్డు అందుకోవటం సంతోషంగా ఉందని సినిమా డైరెక్టర్ ప్రసాద్ రాజు అన్నారు. అరవింద్ జాల మాట్లాడుతూ అనన్య సినిమా రావడం, నటన ద్వారా ప్రేక్షకుల హృదయాలను గెలుచుకోవడం ఆనందకరంగా ఉందని, ముందు ముందు మంచి పాత్రలు పోషించి ప్రజల నుంచి, సినీ ప్రేక్షకుల నుంచి ప్రశంసలు అందుకునేలా చైతన్యంతో పనిచేస్తానని తెలిపారు.

టిడిపిలో చేరిన వైసిపి నాయకులు

టిడిపిలోకి పలువురు

ప్రజాశక్తి - ముసునూరు

వచ్చేది టిడిపి ప్రభుత్వమేనని, ప్రతి ఒక్క వైసిపి నాయకుడు టిడిపిలోకి రావడం సాధ్యమని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. ఆదివారం ఆగిరిపల్లి పట్టణానికి చెందిన రాణిమేకల గణేష్, రాణిమేకల మల్లేశ్వరావు, రాణిమేకల ప్రసాద్, రాణిమేకల భాను, కలవకోలు ప్రసాద్, గండికోట రామస్వామి, కగ్గా వెంకటేశ్వరవు, నక్కా శ్రీనివాసరావు, జలసూత్రం తిరుమలరావు 15 కుటుంబాల వారు పార్థసారథి సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ టిడిపిని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రమణారావు

మేడే ప్రదర్శనలు జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - నిడమర్రు

ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక హక్కులకు భంగం కలిగించే మతతత్వ బిజెపి విధానాలు వ్యతిరేకించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు పిలుపునిచ్చారు. నిడమర్రు ప్రజా సంఘాల కార్యాలయంలో సిఐటియు మండల కమిటీ సమావేశం నిమ్మల పార్వతి అధ్యక్షతన నిర్వహించారు. మే 1వ తేదీన జెండా ఆవిష్కరణలు, ప్రదర్శనలు అన్ని గ్రామాల్లో జరగాలని మండల కమిటీ సమావేశం తీర్మానం చేసింది. ఈ సమావేశంలో కంచం వరప్రసాద్, మైలవరపు నాగలక్ష్మి, ఎస్‌కె.సబీనా, కమిలి నాని, వి.మోహన్, చందర్రావు పాల్గొని మాట్లాడారు.

అభివృద్ధి, సంక్షేమం కోసమే పోటీ

టిడిపి చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి సొంగా రోషన్

ప్రజాశక్తి - చింతలపూడి

పార్టీలోకి ఆహ్వానిస్తున్న రోషన్

నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల ఎదుగుదల, సంక్షేమం కోసం నామినేషన్ వేసినట్లు టిడిపి చింతలపూడి నియోజకవర్గ అభ్యర్థి సొంగా రోషన్ కుమార్ అన్నారు. లింగపాలెం మండలం మఠంగూడెం గ్రామంలో ఎన్ఆర్ఐ బోలినేని సాయి ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో వైసిపి నుంచి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా రోషన్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు మాత్రమే రాష్ట్రాభివృద్ధి చేయగలరని, ఉమ్మడి పొత్తుపై ప్రజలకు నమ్మకం ఉండి పార్టీలోకి వస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో వైసిపి ఖాళీ అవుతుందని తెలిపారు. మద్యపానం నిషేధం అన్నారు.. చేయలేకపోయారు అని విమర్శించారు. నిరుద్యోగ యువకులకు ఉద్యోగాలు ఇవ్వలేకపోయారని, గంజాయి, మత్తు పానీయాలకు బానిసలుగా మారుస్తున్నారని మండిపడ్డారు. దళిత ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజకి ఐదు సంవత్సరాల్లో రూ.కోటి ఇచ్చారని, దానితో ఏ మాత్రం అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. దళిత ఎంఎల్ఎకి అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేని వ్యక్తి జగన్ అని మండిపడ్డారు. సేవ చేసే వారికే ఓటు వేసి గెలిపించాలని కోరారు. కష్టం వస్తే ఇంటికి పెద్ద కొడుకుగా ఉంటాను, ఆపదలో అండగా ఉంటానని తెలిపారు. అనంతరం ఎన్ఆర్ఐ బోలినేని సాయి మాట్లాడుతూ వైసిపి అభ్యర్థి సొంత, పుట్టిన ఊరిలో వైసిపి ఖాళీ అవుతుందని, వైసిపి మాకు వద్దని టిడిపిలో చేరుతున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిని చేసి, సొంగా రోషన్ కుమార్‌ని గెలిపించాలని కోరారు. ఘంటా సాయి మాట్లాడుతూ టిడిపి వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారన్నారు. వైసిపి అభ్యర్థి మొహం ఈ ఊరిలో చాలా మందికి తెలియదని విమర్శించారు. భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంసి చైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, మాజీ ఎంఎల్ఎ గంటా మురళీ, చలపతిరావు పాల్గొన్నారు.

'పేద ప్రజల అభివృద్ధికి జగన్ కృషి'

ప్రజాశక్తి - మండవల్లి

పేద ప్రజల అభివృద్ధి కోసం పథకాలను ప్రవేశపెట్టి, చెప్పిన సమయానికి అందించిన ఏకైక నాయకుడు వైఎస్.జగన్మోహన్ రెడ్డి అని వైసిపి కైకలూరు నియోజకవర్గ అభ్యర్థి దూలం నాగేశ్వరావు స్పష్టం చేశారు. కొర్లపాడు లింగాల, అల్లినగరం గ్రామాలలో సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం 42వ రోజు ప్రజా ఆశీర్వాద యాత్రలో పాల్గొని ప్రజలకు అభివాదం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెప్పాడంటే చేస్తాడు అంతే అనే నినాదానికి నిలువెత్తు నిదర్శమే జగన్ అని అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడే ఏకైక ప్రభుత్వం మన జగనన్న ప్రభుత్వమే అని కొనియాడారు. ప్రతి సంక్షేమ ఫలాలను అర్హత ఒక్కటే ప్రామాణికంగా తీసుకుని ఎటువంటి అవినీతికి, దళారీ వ్యవస్థకు తావు లేకుండా అందించడమే కాకుండా, అందించిన సంక్షేమాలను గ్రామ సచివాలయాల ముందు ప్రదర్శించి, పారదర్శక పాలనందిస్తున్న జగనన్నను ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు. కైకలూరు నియోజకవర్గ అభివృద్ధికి ఎంఎల్ఎ అభ్యర్థి డిఎన్ఆర్, ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్‌ని ఆశీర్వదించి రానున్న ఎన్నికల్లో తమ విలువైన ఓటు ముద్రను ఫ్యాన్ గుర్తులపై వేసి అఖండమైన మెజారిటీతో గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపిపి ఆగస్టు ఆదివిష్ణు పాల్గొన్నారు.

ప్రచారంలో దూలం నాగేశ్వరరావు

నేడు 'రాజ్యాంగ పరిరక్షణ - కర్తవ్యాల'పై సదస్సు

ప్రజాశక్తి - తణుకురూరల్

మహాకవి శ్రీశ్రీ 114వ జయంతి సందర్భంగా ఈనెల 29వ తేది సోమవారం సాయంత్రం 5 గంటలకు తణుకులో స్థానిక ప్రత్యూష థియేటర్ పక్కన, మెడికల్ హాల్‌లో శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్రం, తణుకు స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ - కర్తవ్యాలు అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు తణుకు స్టడీ సర్కిల్ కన్వీనర్ డివివిఎస్.వర్మ, శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్రం ఛైర్మెన్ పి.దక్షిణామూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సదస్సుకు ప్రధాన వక్తగా ఎంఎల్ఎ కెఎస్.లక్ష్మణరావు హాజరవుతున్నారని తెలిపారు. సహృదత్వం, సమానత్వం, శాంతి, సంపదలతో తులతూగాల్సిన మన దేశం ఇవాళ ఏ పరిస్థితుల్లో ఉందో ప్రత్యేకంగా వివరించాల్సిన పనిలేదన్నారు. 75 ఏళ్ల సామాజిక పరిణామక్రమం రాజ్యాంగ ఆశయాలను సాధించడంలో ఎంత వెనుకబడిందో మన కళ్లకు కట్టినట్లు కనబడుతుందన్నారు. జాతి, మత, కుల, ప్రాంతీయ విద్వేషాలు మరింత పెచ్చురిల్లిపోయి దేశ సంపద, సహజ వనరులు గుప్పెడు మంది చేతుల్లో పోగుపడిపోతుందన్నారు. శరీర కష్టం చేసే కార్మికులు, రైతులు, కష్టజీవుల ఇక్కట్లు పెరిగిపోతున్నాయన్నారు. విద్యా, వైద్య సౌకర్యాలు, పౌష్టికాహార లభ్యత ప్రియమైపోయాయని, అత్యధిక ప్రజానీకం హుందా, గౌరవప్రదమైన జీవితాలకు ఇంకా దూరంగానే ఉన్నారన్నారు. శ్రమయేవ జయతే అన్న అధికారిక నినాదం సిగ్గుతో చిమిడిపోతుందన్నారు.

శ్రమను గౌరవించి, తగు రీతిన ప్రతిఫలం అందించే విధానాల ఊసే లేకుండా పోతుందన్నారు. ఇప్పుడు దేశం యావత్తును ఆవరించిన సామాజిక, ఆర్థిక రాజకీయ సంక్షోభాన్ని, పరిస్థితులను అర్థం చేసుకోవడానికి ఈ సదస్సు ఏర్పాటు చేయడమైందని తెలిపారు. ఈ సదస్సులో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

'వైసిపి హయాంలో తీరప్రాంత గ్రామాలాభివృద్ధి'

ప్రజాశక్తి - మొగల్తూరు

వైసిపి పాలనలో తీర ప్రాంత గ్రామాలు అభివృద్ధి చెందాయని జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాపూజీ అన్నారు. మండలంలోని కాళీపట్నం తూర్పు ఆదివారం ప్రజా ఆశీర్వాద కార్యక్రమాలు వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు, తను ఈడు శ్రీకృష్ణరాయతో కలిసి గ్రామంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు వివరించారు. ముదునూరు ప్రసాద్ రాజును గెలిపించాలన్నారు.

ప్రత్యేక పంచాయతీలపై దళితుల హర్షం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

వైసిపి మేనిఫెస్టోలో దళిత వాడలకు ప్రత్యేక పంచాయతీలు ఏర్పాటు అంశం పొందుపరచటం పట్ల దళితులు హర్షం ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం సాయత్రం ఎంపిపి గంజిమాల రామారావు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. తొలుత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిపి రామారావు మాట్లాడుతూ దళితుల అభివృద్ధికి జగన్మోహన్ రెడ్డి ఆలోచన చేయటం ముదావహంగా పేర్కొన్నారు. జగన్ ప్రకటించిన మేనిఫెస్టో ఆశాజనకంగా ఉందన్నారు. అన్ని వర్గాలకు అనుకూలంగా ఉన్న మేనిఫెస్టో ద్వారా మరోసారి జగన్‌ని ముఖ్యమంత్రి చేసుకోవాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ సేవా సమితి కార్యదర్శి టిఎన్.స్నేహన్, వైసిపి మండల ప్రచార కార్యదర్శి తొర్లపాటి వాసు మాట్లాడుతూ 500 మంది ఎస్‌సి జనాభాకు పంచాయతీ ఏర్పాటు చేయటం ముదావహంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్పకాయలపాడు ఎస్‌సి సెల్ అధ్యక్షులు బొనగిరి ఆశీర్వాదం, అచ్యుతాపురం ఎస్‌సి సెల్ అధ్యక్షులు బయ్యే రామకృష్ణ పాల్గొన్నారు.

'జగన్ ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి'

ప్రజాశక్తి - కుక్కునూరు

మండల పరిధిలో వైసిపి పోలవరం నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కివ్వక పంచాయతీ పరిధిలో నక్క జగన్నాధం, పల్లంటి రంగయ్యకు చెందిన 10 మంది టిడిపి కుటుంబాలు వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్యం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పాలన, మేనిఫెస్టో చూసి ఆకర్షితులై పార్టీలోకి వచ్చామని అన్నారు. తెల్లం రాజ్యాలక్ష్మి గెలుపుకోసం అహర్నిశలు కష్టపడి గెలుపులో పాలు పంచుకుంటామని, కుక్కునూరు మండలం కివ్వక పంచాయతీ బూత్ పరిధిలో అధిక మెజారిటీ వచ్చే విధంగా కృషి చేస్తామని వారు అన్నారు.

నేడు జానీ మాస్టర్ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - మొగల్తూరు

సినీ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ సోమవారం మొగల్తూరు రానున్నారని జనసేన నాయకులు తెలిపారు. జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్ విజయం కోరుతూ ఆయన నియోజకవర్గంలో పర్యటన చేయనున్నారని, దీనిలో భాగంగా మొగల్తూరులో ఎన్నికల ప్రచారం చేస్తారని జనసైనికులు తెలిపారు.

కుక్కునూరులో బాలరాజు ప్రచారం

ప్రజాశక్తి - కుక్కునూరు

టిడిపి ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి పుట్టా మహేశ్ యాదవ్, జనసేన పోలవరం అసెంబ్లీ అభ్యర్థి చిర్రి బాలరాజు మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆదివారం కుక్కునూరు మండలంలోని నగరం, వేలేరు, పెద్దరాయి గూడెం, గణపవరం, తొండిపాక, అమరవరం, ఉప్పేరు, దామరచర్ల, చిరావల్లి, వింజరం, మారేడువాక, కివ్వాక, దాచావరం, గొమ్ముగూడెం గ్రామాలతో పాటు కుక్కునూరు సెంటర్‌లో రోడ్ షో నిర్వహించారు. కూటమి నేతలను కుక్కునూరు పట్టణంలోకి ఆహ్వానిస్తూ పదుల సంఖ్యలో గిరిజన కళాకారులు సాంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. డప్పు కళాకారుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వైసిపి దుర్మార్గ పాలనను ఎండగడుతూ, ప్రజలకు చేయబోయే మంచిని వివరిస్తూ ముందుకు కదిలారు. సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ రోడ్ షో నిర్వహించారు.

మొగల్తూరులో అన్న సమారాధన

మొగల్తూరు: మొగల్తూరులోని రాజగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం అన్న సమారాధన చేశారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని సీతారాముల కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహెూత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వహణ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

మొగల్తూరు : మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కళకళలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన భక్తి గీతాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి, సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ముఖ్య వార్తలు

సోమవారం 29 ఏప్రిల్ 2024

టిడిపిలోకి పలువురు

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని కొండంగిలో టిడిపి నాయకుడు తిరుమాని నాగార్జున ఆధ్వర్యంలో సుమారు 300 మంది నాయకులు, కార్యకర్తలు వైసిపిని వీడగా, వారిని టిడిపి మండల అధ్యక్షులు పోకల జోగిరాజు పార్టీ కండువా కప్పి ఆహ్వానించినట్లు రాష్ట్ర టిడిపి బిసి సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు తెలిపారు. వల్లభనేని శ్రీనివాస చౌదరి, సున్న రమాదేవి, ముద్దం భోగేశ్వరరావు, కొల్లాటి నాగరాజు, మంతెన సుబ్బరాజు, వైదాని సత్తిరాజు పాల్గొన్నారు.

బొలిశెట్టిని గెలిపించాలి

జానీ మాస్టర్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నిస్వార్థంగా ప్రజలకు సేవ చేసే నాయకుడిని గెలిపించుకోవాలని కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ తెలిపారు. జనసేన తాడేపల్లిగూడెం నియోజకవర్గం ఎంఎల్ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. జనసేన స్టార్ క్యాంపెనర్‌గా రాష్ట్రంలో పలు నియోజకవర్గాల్లో జనసేన ఎంఎల్ఎ అభ్యర్థుల తరపున ప్రచారం చేస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ తరపున జానీ మాస్టర్ ప్రచారం చేపట్టారు. జానీ మాస్టర్ మాట్లాడుతూ అధికారం లేకపోయినా పేద ప్రజలకు నిస్వార్థంగా సేవ చేస్తున్న బొలిశెట్టి శ్రీనివాస్‌ను పలువురు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఇన్‌ఛార్జి వలవల బాబ్జి, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ పాల్గొన్నారు.

దళిత ఉద్యమాల్లో పోరాడా

చింతలపూడి స్వతంత్ర అభ్యర్థి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - కామవరపుకోట

గత 15 సంవత్సరాలుగా దళిత ఉద్యమాలలో ప్రజల వైపు అనేక రకాలైన పోరాటాలు చేశానని చింతలపూడి నియోజకవర్గ ఇండిపెండెంట్ అభ్యర్థి అడ్వకేట్ తొర్లపాటి శ్రీనివాసరావు తెలిపారు. ఆయన ఆదివారం కామవరపుకోటలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాన పార్టీలు నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలేదని, కేవలం ఎలక్షన్లు వచ్చినప్పుడు మాత్రమే ప్రజల ముందుకు వచ్చి, వారికి లేనిపోని హామీలు ఇస్తున్నాయని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వాడుకుంటున్నారని, వారి సమస్యలు పట్టించుకునే వారే లేరని, తాను క్రింద స్థాయి నుంచి వచ్చానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

డిఎన్ఆర్‌ను గెలిపించాలని

కోడలు ప్రచారం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైసిపి తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులను ఆశీర్వదించాలని ఎంఎల్ఎ డిఎన్ఆర్ కోడలు స్వాతి కోరారు. ఆదివారం మండలంలోని పెయ్యేరు, ముదినేపల్లి గ్రామాల్లో వైసిపి నాయకులతో కలిసి స్వాతి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ఆశీస్సులతో ఏలూరు పార్లమెంట్ అభ్యర్థిగా కె.సునీల్ కుమార్ యాదవ్, కైకలూరు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా దూలం నాగేశ్వరరావు పోటీ చేస్తున్నందున ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వారిని ఆశీర్వదించాలని కోరారు. ఈ ప్రచారంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి పాల్గొన్నారు.

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి

ప్రజాశక్తి - నరసాపురం

రాష్ట్రానికి ద్రోహం చేసిన మతతత్వ బిజెపిని, టిడిపిని, జనసేన, నిరంకుశ వైసిపిని ఓడించి కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, ఇండియా వేదిక బలపరిచిన కాంగ్రెస్ నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి కానూరి ఉదయ భాస్కర కృష్ణప్రసాద్(బుజ్జి)ని గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కవురు పెద్దిరాజు అన్నారు. స్థానిక పట్టణంలో పాత బజారు, మెయిన్ రోడ్డు, అంబేద్కర్ సెంటర్, బస్టాండ్ ప్రాంతాల్లో కార్యకర్తలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాత బజార్ సెంటర్‌లో భవన నిర్మాణ కార్మికులను ఉద్దేశించి కానూరు బుజ్జి మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం, ప్రజాస్వామ్యం లౌకిక పరిరక్షణ కోసం నిరంతరం కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం పార్టీలు పోరాడుతున్నాయన్నారు. ఈ మూడు పార్టీలు బలపరిచిన తనను ఎంఎల్ఎగా గెలిపించాలని, తమ ఎన్నికల గుర్తు అయిన హస్తం గుర్తుపై అమూల్యమైన ఓటు ముద్ర వేసి అఖండ విజయాన్ని చేకూర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి త్రిమూర్తులు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న బుజ్జి

రైతులకు అండగా కాంగ్రెస్

కాంగ్రెస్ ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి వెంకట గోపాలకృష్ణంరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ప్రతి రైతుకు కాంగ్రెస్ అండగా నిలుస్తుందని, అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని కాంగ్రెస్ ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు కోరారు. మండలంలోని దొడ్డనపూడి, కాళ్ళ, సీసలి, జక్కరం, పెదఅమిరం గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వరి, ఆక్వా రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరి రైతులు పండించిన ధాన్యాన్ని అమ్మేందుకు రోజుల తరబడి నిరీక్షణ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆక్వారైతుకు విద్యుత్ సబ్సిడీ వర్తించక పోవడంతో వైరస్ వల్ల రైతులు నష్టాల ఊబిలో ఉన్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తొమ్మిది గ్యారెంటీలను ఇచ్చిందని, వాటిలో రైతు రుణ మాఫీ ఒకటని తెలిపారు. ఈ ప్రచారంలో కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సోడదాసి గంగయ్య, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సోము నాగబాబు, ఆకివీడు కాంగ్రెస్ అధ్యక్షులు చింతా అది శేషు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న గోపాలకృష్ణంరాజు

బుర్రకథ ప్రదర్శన ద్వారా కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - మండవల్లి

రాష్ట్ర ప్రజల అభివృద్ధి, దేశాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బుర్రకథ ప్రదర్శన పలువురిని ఆలోచింపజేసింది. స్థానిక సెంటర్‌లో ఆదివారం కళాబృందం వారు ఆదివారం బుర్రకథను ప్రదర్శించారు. కాంగ్రెస్ పాలనలో దేశంలోని ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉంటారని తెలిపారు. ప్రజల పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలోనే కైకలూరు నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని, పేద, బడుగు, బలహీన వర్గాల కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి అభివృద్ధి చేయడం జరిగిందని అన్నారు. ఇప్పుడు మీరు చూస్తున్న అభివృద్ధి అంతా కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిందని, బుర్రకథ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. మరింత అభివృద్ధి కోసం కైకలూరు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొడ్డు నోబుల్‌కి, పార్లమెంట్ సభ్యులుగా పోటీ చేస్తున్న కావూరి లావణ్యకి అమూల్యమైన ఓటు ముద్రను హస్తం గుర్తుపై వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కళాబృందం వారు కళతో వినూత్నంగా ప్రచారాన్ని నిర్వహించారు.

బుర్ర కథ చెబుతూ ప్రచారం నిర్వహిస్తున్న కళాబృందం

'సంక్షేమ పథకాల అమలు చూసి ఓటేయండి'

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు చూసి ఓటేయాలని వైసిపి పోలవరం నియోజకవర్గ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ములగలంపల్లి, టి.గంగన్నగూడెం, స్వర్ణవారిగూడెం పంచాయతీలలో నియోజకవర్గ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మితో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రతి గడపకూ తిరుగుతూ ఓట్లను అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును చూసి ప్రజలు మళ్లీ వైసిపికు ఓట్లు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఎన్‌డిఎ కూటమి పార్టీలైనా టిడిపి, బిజెపి, జనసేన పార్టీలు అధికారంలోకి రావడం కోసం పొంతన లేని అబద్ధపు హామీలు ఇస్తున్నారని, అటువంటి మోసపూరిత మాటలు నమ్మవద్దని తెలిపారు. త్వరలో జరగబోవు సార్వత్రిక ఎన్నికల్లో మరలా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తెల్లం రాజ్యలక్ష్మిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి వసంతరావు, వైస్ ఎంపిపి సోమాగని శ్రీనివాస్, వైసిపి మండల అధ్యక్షులు సందా ప్రసాద్ పాల్గొన్నారు.



ప్రచార కార్యక్రమంలో రాజ్యలక్ష్మి

'రైతులకు లబ్ధి చేకూర్చేందుకు కృషి చేస్తా'

ప్రజాశక్తి - ఉండి

రైతుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి వారికి మరింత లబ్ధి చేకూర్చేందుకు కృషి చేస్తానని వైసిపి ఉండి నియోజకవర్గ అభ్యర్థి పివిఎల్ నరసింహారాజు అన్నారు. ఆదివారం ఉండి మండలం చిన్నపుల్లేరు, పెదపుల్లేరు, వాండ్రం గ్రామాలలో వైసిపి మండల పార్టీ అధ్యక్షులు పెన్మెత్స ఆంజనేయరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారాల్లో పాల్గొన్న పివిఎల్ నరసింహారాజు రైతులతో మాట్లాడుతూ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉందని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తిరిగి ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డికి అవకాశం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఏలూరు నగరంలో ఆదివారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు నగరంలోని బీడీ కాలనీకి చెందిన కాకినాడ సతీష్(41) స్థానికంగా వడ్రంగి పనులు చేస్తూ భార్య, పిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం రామకృష్ణాపురం వద్ద రైలు పట్టాలు దాటి అటువైపు వెళుతున్న సమయంలో గుర్తు తెలియని రైలు బండి అతన్ని ఢీకొంది. ఈ ఘటనలో సతీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసి వివరాలు సేకరిస్తున్నారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ నంబూరు ఆది నారాయణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఎస్ఐ మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

లారీ వెనుక చక్రం కింద పడి రిటైర్డ్ ఎస్ఐ మృతి చెందిన ఘటన ఏలూరు నగరంలో ఆదివారం చోటుచేసుకుంది. ఏలూరు రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు నగరానికి చెందిన ఎస్‌కె భాషా(82) భార్య చనిపోవడంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. మీనా ఎస్ఐగా పనిచేసి ప్రస్తుతం 20 ఏళ్లుగా విశ్రాంత ఉద్యోగిగా ఉన్నారు. కొంతకాలం క్రితం భార్య చనిపోయింది. అప్పటి నుంచి ఆయన ఒంటరిగానే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఆయన వాహనంపై ఏలూరు నగరంలోని అశోక్ నగర్ పెట్రోల్ బంకు దాటుతున్న సమయంలో ముందుగా వెళుతున్న లారీ వెనుక చక్రం కిందపడ్డాడు. ఈ ఘటనలో భాష అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం నిర్వహించి ఆదివారం రాత్రి బంధువులకు అప్పగించారు. ఈ ఘటనపై రెండో పట్టణ ఎస్ఐ సాదిక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆగి ఉన్న కారును ఢీ కొట్టిన లారీ

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరులో శనివారం అర్ధరాత్రి లారీ బీభత్సాన్ని సృష్టించింది. రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన కారును ఢీ కొట్టి కారును ఈడ్చుకుంటూ వెళ్లింది. ఈ ఘటనలో కారు నుజ్జు నుజ్జు అయ్యి ఎందుకు పనికి రాకుండా పోయింది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పాలకోడేరు మెయిన్ రోడ్డులోని వాటర్ ట్యాంక్ వద్ద గ్రామానికి చెందిన ఒక వ్యక్తి కారును రోజు మాదిరిగానే పార్కింగ్ చేయడం జరిగింది. భీమవరం నుంచి వండర్ వైపు వెళ్తున్న టిప్పర్ లారీ అర్ధరాత్రి రెండు గంటల సమయంలో వాటర్ ట్యాంక్ వద్ద పక్కనే పార్క్ చేసి ఉన్న కారును లారీ ఢీ కొట్టడంతో కారు నుజ్జు నుజ్జు అయింది. ఆ సమయంలో కారులో ఎవరూ లేకపోవడం, అర్ధరాత్రి కావడం, జనసంచారం పెద్దగా లేకపోవడం పెను ప్రమాదం తప్పింది. కారు మాత్రం పూర్తిగా ధ్వంసం అయింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని తాటియాకుల గూడెం అంతర్రాష్ట్ర సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద ఆదివారం ఎస్ఐ వి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేస్తుండగా తెలంగాణ రాష్ట్రంలోని అశ్వరావుపేట నుంచి ఓ వ్యక్తి కార్‌లో అక్రమంగా 10 బాటిళ్ల మద్యంను తరలిస్తుండగా పట్టుకోవడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. మద్యాన్ని, కార్‌ను స్వాధీనం చేసుకొని, ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

'టిడిపి మాటలు నమ్మి మోసపోవద్దు'

ప్రజాశక్తి - కామవరపుకోట

టిడిపి మోసపూరితమైన మాటలు నమ్మి టిడిపికి ఓటు వేస్తే గ్రామ సచివాలయ వ్యవస్థను తీసేయడంతో పాటు, ఇప్పుడు అందించే సంక్షేమ పథకాలు రద్దయి, రాష్ట్ర అభివృద్ధి కుంటుపడుతుందని ఎంపిపి విజయలక్ష్మి గ్రామస్తులకు సూచించారు. మండలంలోని కామవరపుకోట కొత్తూరులో ఎంపిపి మేడవరపు విజయలక్ష్మి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సిఎం జగన్ మోహన్ రెడ్డి పరిపాలన చేపట్టినప్పుడు నుంచి అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరి ఇంటికి సంక్షేమ పథకాలు అందించి, రానున్నది వైసిపి ప్రభుత్వం అని దిమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ మిడత రమేష్ బాబు, సర్పంచి కరిపోతు అనూష భాగ్యరాజ్, ఉప సర్పంచి మేడూరి రంగబాబు పాల్గొన్నారు.

అభ్యర్థుల వ్యయాలపై నిరంతర పర్యవేక్షణ

జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్

భీమవరం :ఎన్నికల నిర్వహణలో భాగంగా ఆర్థిక లావాదేవీలు, ఖర్చులు, ఇతర వ్యయాలపై నిరంతర పర్యవేక్షణ ఏర్పాటు చేశామని, అభ్యర్థులు, రాజకీయ పార్టీలు నిబంధనలను కచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థిక లావాదేవీలు, నగదు బట్వాడా, బహుమతులు, ఇతర వస్తువుల తరలింపు, మద్యం రవాణా తదితర అంశాలపై నిరంతర పర్యవేక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధికారులు అందరి పట్ల నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ ఎన్నికలను అత్యంత పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేయాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు బాధ్యతగా పని చేయాల్సి ఉందన్నారు. ఒకరికొకరు సహకరించుకుంటూ ఎన్నికలను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. సమాచార లోపం తలెత్తకుండా సమన్వయంతో పని చేయాలన్నారు. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులకు ఏమైనా సందేహాలుంటే జిల్లా స్థాయి ఎన్నికల అధికారులతో సంప్రదింపులు చేసి నివృత్తి చేసుకోవాలన్నారు. పార్టీలు గానీ, అభ్యర్థులు గానీ అనధికారికంగా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయడానికి వీలు లేదని, వారు చేసే ఆర్థిక లావాదేవీలపై నిరంతర పర్యవేక్షణ తప్పక ఉంటుందన్నారు. జిల్లాలో ఐదు చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, విస్తృత తనిఖీలు చేపడుతున్నామన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేం దుకు పటిష్ట చర్యల్లో భాగంగా ఫిర్యాదుల స్వీకరణ, మీడియా పర్యవేక్షణ, మోడల్ కోడ్ అమలు, సి-విజిల్ తదితర సేవల కోసం 24/7 పని చేసేలా కంట్రోల్ రూమ్ నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

పోలింగ్‌కు పూర్తిస్థాయిలో సన్నద్ధం

ఆచంట రిటర్నింగ్ అధికారి స్వామినాయుడు

ఆచంట :మే 13న జరిగే పోలింగ్‌కు పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉన్నామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడు అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల విధుల నిర్వహణలో ఉన్న సిబ్బంది ఫాం12తో పాటు ఎపిక్ కార్డు, డ్యూటీ సర్టిఫికెట్, ఎన్నికల విధి నిర్వహణ ఉత్తర్వులు సమర్పించాలన్నారు. వచ్చే నెల రెండు నుంచి ఐదో తేదీ వరకు హోమ్ ఓటింగ్, ఇవిఎంల కమిషన్నింగ్ జరుగుతాయని తెలిపారు. మే 8, 9 తేదీల్లో ప్రిసైడింగు, ఆన్ ప్రిసైడింగ్, అధికారులకు రెండో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. పోస్టల్ ఓటింగ్‌కు ఆచంట ఎంవిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓటింగ్ చేపడతామని తెలిపారు. ఇదేకాకుండా రిటర్నింగ్ కార్యాలయంలో మే పదో తేదీ నుంచి 12 వరకు అత్యవసర సర్వీసులు వారు పోస్టల్ బ్యాలెట్ దాఖలు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 28వ తేదీ నుంచి బిఎల్ఓ ద్వారా ఓటర్ స్లిప్పులు అందిస్తామన్నారు.

ప్రజా సంకల్పయాత్ర ఓ బ్రహ్మాస్త్రం

టిడిపి ఏలూరు ఎంఎల్ఎ అభ్యర్థి బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రజల మనసులు గెలిచే నేతలే అధికారం చేపట్టేందుకు అర్హులైన పాలకులవుతారని, ఆ దిశగా టిడిపి అగ్రనాయకత్వం ఇస్తున్న భరోసా రానున్న ఎన్నికల్లో గెలుపునకు నాంది అని ఏలూరు ఎంఎల్ఎ అభ్యర్థి బడేటి చంటి అన్నారు. ప్రజా సంకల్పయాత్ర అనేది ఏలూరు నియోజకవర్గంలో చేపట్టిన ఓ బ్రహ్మాస్త్రమని, అటు ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు, ఇటు నాయకులు, కార్యకర్తలను కలుపుకుంటూ వారిలో నూతనోత్సాహం నింపేందుకు దోహదం చేసేలా రూపకల్పన చేశారని చెప్పారు. ఏలూరులోని కట్టా సుబ్బారావుతోటలో ఆదివారం చేపట్టిన ప్రజా సంకల్పయాత్రలో బడేటి చంటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తూ ఆయా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ప్రజల కష్టాలు తొలగిపోతాయన్నారు. ఇక వైసిపి అరాచక ఆటలు సాగవని, ఆ పార్టీ నేతలనందరినీ ప్రజలే డక్ అవుట్ చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి బ్రాహ్మణ సాధికార సమితి ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ ఎంబిఎస్.శర్మ, టిడిపి నేత కడియాల విజయలక్ష్మి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంకల్పయాత్రలో బడేటి చంటి

గ్రామాలాభివృద్ధికి కృషి చేస్తా

జనసేన ఉంగుటూరు ఎంఎల్ఎ అభ్యర్థి ధర్మరాజు

ప్రజాశక్తి - గణపవరం

నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని, రానున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని జనసేన ఉంగుటూరు ఎంఎల్ఎ అభ్యర్థి ధర్మరాజు అన్నారు. మండలంలోని పిప్పర, గణపవరం గ్రామాల్లో ఆయన ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తనను ఎంఎల్ఎగా గెలిపిస్తే మరిన్ని సేవలందిస్తానన్నారు. నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమానికి కృషి చేస్తానని చెప్పారు. తాను ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. రానున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. ఈ కారక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న అభ్యర్థులు ధర్మరాజు

పేద, మధ్యతరగతి వారికి ఉపయోగకరంగా మేనిఫెస్టో

వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి కంభం విజయరాజు

ప్రజాశక్తి - చింతలపూడి

సిఎం జగన్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టో పేద, మధ్య తరగతివారికి ఎంతో ఉపయోగపడుతుందని వైసిపి చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. చింతలపూడిలో ఆయన ఆదివారం తెల్లవారుజామున వాకింగ్ విత్ కెవిఆర్ నినాదంతో ప్రజలను పలకరించుకుంటూ మార్నింగ్ వాక్ చేశారు. చింతలపూడి మార్కెట్‌యార్డులో వ్యాపారులతో మాట్లాడారు. మార్కెట్‌లో మటన్ కొట్టారు. రానున్న ఎన్నికలో వైసిపిని గెలిపించాలని కోరారు. జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన మేనిఫెస్టో పేద, మధ్య తరగతివారికి ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కొప్పుల నాగు, మిర్యాల దిలీప్, వెంప కృష్ణ, సిటీ మెడికల్ దుర్గారావు, గణేష్ పాల్గొన్నారు.

చింతలపూడి : అర్హులందరికీ వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని ఆ పార్టీ చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. లింగపాలెం, తిమ్మక్కపాలెం గ్రామాల్లో ఆయన ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మైత్రి డెవలపర్స్ అధినేత వేమిరెడ్డి సూరారెడ్డి, ఎంపిపి ముసునూరి నాగేశ్వరరావు, పార్టీ మండలాధ్యక్షులు మోహన్‌రావు పాల్గొన్నారు.

మటన్ కొడుతూ విజయరాజు

అక్షర క్రమంలో ముందు.. అభివృద్ధిలో వెనుక..

ఆచంట నియోజకవర్గం అక్షర క్రమంలో ముందున్నా అభివృద్ధిలో మాత్రం ఆమడ దూరంలో ఉంది. నియోజకవర్గంలో పలు సమస్యలు తాండవిస్తున్నాయి. పాలకులు మారినా వాటి పరిష్కారంలో నిర్లక్ష్యం వహించడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

అమలు కాని హామీలు - శిథిలావస్థలో వంతెనలు అస్తవ్యస్తంగా డ్రెయిన్లు - ప్రజల అవస్థలు

ఫోకస్

శిథిలావస్థకు చేరిన పోడూరు మండలం గుమ్మలూరు నుంచి వద్దిపర్రు వెళ్లే వంతెన

ప్రజాశక్తి - ఆచంట

నియోజవర్గ ప్రజలకు అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు ఎన్నికల హామీగానే మిగిలిపోయింది. నియోజకవర్గంలో ఫైర్ స్టేషన్ లేకపోవడంతో ఏటా లక్షల రూపాయల ఆస్తి నష్టంతో పాటు ప్రాణం నష్టం జరుగుతోంది. ఆచంటకు సుమారు 20 కిలోమీటర్ల దూరంలోని పాలకొల్లు నుంచి ఫైర్ ఇంజిన్ వచ్చేసరికి జరగాల్సిన నష్టం జరగిపోతోంది. ఈ విషయంపై ఎంఎల్ఎ రంగనాథరాజు ఆచంటలో పంచాయతీ ఆధ్వర్యంలో 18 సెంట్ల స్థలాన్ని సేకరించారు. ఈ క్రమంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.మూడు కోట్లు మంజూరయ్యాయి. అయితే ఈలోపు ఎన్నికల కోడ్ రావడంతో ఆ సమస్య పరిష్కారం కాని పరిస్థితి నెలకొంది.

అటకెక్కిన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ..

ఆచంటలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం పూర్తి కాలేదు. గతంలో రూ.6 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రెయిన్‌ను నిర్మిస్తానని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ చివరికి చేతులెత్తేశారు. స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలోని చిన్నపేటలో 200 మీటర్ల మేర నిర్మించి చేతులు దులుపుకున్నారు. మరో 1200 మీటర్ల నిర్మాణం జరిగితే గాని పూర్తికాని పరిస్థితి నెలకొంది. దీంతో డ్రెయిన్ పరిసరాల్లో నివసించేవారితోపాటు గ్రామస్తులు రోగాల బారిన పడుతున్నారు.

బస్టాండ్ లేక ఇబ్బందులు..

ఆచంటలో బస్‌స్టాండ్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇతర గ్రామాల నుంచి ఆచంట వచ్చే ప్రయాణికులకు నిలువ నీడ లేక అవస్థలు పడుతున్నారు. దీంతో బస్సుల కోసం ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ రోడ్డుపై నిరీక్షిస్తున్నారు. పాలకులు ఇదిగో అదుగో అంటున్నారే గానీ పట్టించుకున్న పాపాన పోలేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అయోధ్యలంక వారధి నిర్మాణం గాలికి..

ఈ నియోజకవర్గం అభివృద్ధిలో మాత్రం వెనుకబడి ఉంది. లంక గ్రామాల పరిస్థితి మరి దయనీయం. అయోధ్య లంక, పుచ్చలంక, పల్లెపాలెం, అనగార్లంక గ్రామాల్లో వేలాది మంది నివాసం ఉంటున్నారు. ఇవన్నీ లంక గ్రామాలు కావడంతో ఇక్కడ పండిన పంటను రైతులు పడవలపై ఏటిగట్టుకు చేరవేసి రవాణా చేస్తుంటారు. ఆయా గ్రామాలను చేరుకోవాలంటే పడవలను ఆశ్రయించక తప్పదు. లంక గ్రామాలను కలుపుతూ గోదావరిపై వంతెన నిర్మిస్తామని పాలకులు హామీలు ఇచ్చినా ఆచరణ మాత్రం శూన్యం. లంక గ్రామాల అభివృద్ధి అంతా వంతెనలతోనే ముడిపడి ఉంది. కోడేరు నుంచి తూర్పుగోదావరి జిల్లా గన్నవరం వరకూ గోదావరిపై వంతెన నిర్మాణం కలగానే మారింది. వంతెన నిర్మిస్తే ఉభయగోదావరి జిల్లాల వాసులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది.

పరిష్కారం కాని మురుగు సమస్యను..

నియోజకవర్గంలోని ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర, పోడూరు మండలాల్లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. పెనుమంట్ర మండలం గోస్తని డ్రెయిన్‌తో పాటు ఇతర డ్రెయిన్ల నిర్మాణం కోసం ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా పోరాటాలు చేసినా ఫలితం శూన్యం. గోస్తనీ డ్రెయిన్‌తో పాటు ఇతర డ్రెయిన్లు తవ్వకం పనులు ఇప్పటికీ చేపట్టలేదు. 30 ఏళ్ల క్రితం తవ్విన డ్రెయిన్ పూడుకుపోయి ఏటా వేల ఎకరాల పంట నీట మునుగుతోంది. ఎన్నికల సమయంలో సమస్యలు పరిష్కరిస్తామంటూ ఎడాపెడా హామీలు గుప్పిస్తున్నారు. తరువాత వాటిని గాలికొదిలేస్తున్నారు.

సాగునీటి సమస్యను విస్మరించారు..

సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతానంటూ ఎన్నికల సాక్షిగా హామీ ఇచ్చారు. దొంగరావిపాలెం వద్ద ఎత్తిపోతల పథకాన్ని శాశ్వత ప్రతిపాదికన ఏర్పాటు చేస్తామని హామీని దాటవేస్తూ వస్తున్నారు. దీంతో రైతులు సాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. దొంగరాయపాలెం వద్ద వశిష్ట గోదావరి నుంచి కోడేరు బ్యాంక్ కెనాల్‌లోకి నీటిని ఎత్తిపోతల పథకం ద్వారా అందించడానికి హామీ ఇచ్చారు. ఒక్క ఏడాదితోనే సరిపుచ్చేశారు. బ్యాంక్ కెనాల్‌పై ఆధారపడి సుమారు 35 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఏటా దాళ్వాలో శివారు ప్రాంతాల రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పెనుగొండ మండలం దొంగరాయపాలెం వద్ద శాశ్వత ఎత్తిపోతల పథకం నిర్మించాలని కోరుతున్నా తాత్కాలిక లిఫ్ట్ ఏర్పాటు చేసి పాలకులు చేతులు దులుపుకున్నారు.

ఆచంటలో గుర్రపు డెక్కతో నిండి ఉన్న తాడేరు మురుగు కాలువ


పెనుగొండలో అస్తవ్యస్తంగా మార్కెట్

ఆచంటలో అస్తవ్యస్తంగా ఉన్న మురుగు డ్రెయిన్

స్మశానానికి నిష్కృతి లేదు..

పెనుగొండలో మార్కెట్ అస్తవ్యస్తంగా ఉంది. వర్షం వస్తే చాలు మార్కెట్ అంతా వర్షపు నీటితో బురదమయంగా మారుతుంది. దీంతో వ్యాపారులతోపాటు కొనుగోలుదారులు అనేక ఇబ్బందులు గురవుతున్నారు.

శిథిల వంతెనలతో ముప్పు.. ఎప్పటికో కనువిప్పు..

పోడూరు, ఆచంట మండలంలో మురుగు డ్రెయిన్లపై నిర్మించిన వంతెనలకు కాలం చెల్లడంతో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. దీంతో ఆయా వంతెనలపై ప్రయాణానికి వాహనదారులు భయపడుతున్నారు. వంతెన స్లాబులు దెబ్బ తినడంతో ఎప్పుడు కూలిపోతాయో అర్థం కాని పరిస్థితి. గుమ్ములూరు నుంచి వద్దిపర్రు వెళ్లే వంతెన శిథిలావస్థకు చేరింది. అయినా అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో ప్రజల అనేక ఇబ్బందులు పడుతున్నారు.

నరసాపురంలో ఎన్నికల పరిశీలకురాలు పర్యటన

స్ట్రాంగ్ రూమ్‌లు, చెక్‌పోస్టుల పరిశీలన

ప్రజాశక్తి - నరసాపురం

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఆదివారం జిల్లా ఎన్నికల పరిశీలకురాలు ఎం.దీప నరసాపురం పట్టణంలో పర్యటించారు. ముందుగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి విచ్చేసిన ఆమె అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ డాక్టర్ ఎం.అచ్యుత్ అంబారీష్‌తో ఎన్నికల ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. స్థానిక శ్రీ వైఎన్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఇవిఎం స్ట్రాంగ్ రూమ్ బందోబస్తును పరిశీలించారు. అనంతరం మాధవాయపాలెం పంటి రేవు వద్ద ఏర్పాటుచేసిన అంతర్‌జిల్లా చెక్‌పోస్ట్‌ను, పట్టణ సరిహద్దు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించారు. వీరితో పాటు నరసాపురం తహశీల్దార్ ఎస్ఎస్ఎస్.ప్రసాద్ ఉన్నారు.


స్ట్రాంగ్ రూములను పరిశీలిస్తున్న దీప

ఇండియా వేదికతోనే సుస్థిర పరిపాలన

ఎంపీ, ఎంఎల్ఎ అభ్యర్థులు లావణ్య, నోబుల్

ప్రజాశక్తి - కైకలూరు

ఇండియా వేదికతోనే దేశంలో సుస్థిర పరిపాలన సాధ్యమవుతుందని ఏలూరు ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్య, కైకలూరు ఎంఎల్ఎ అభ్యర్థి బొడ్డు నోబుల్ అన్నారు. కైకలూరు నియోజకవర్గం నాలుగు మండలాల్లో ఆదివా రం బైక్ ర్యాలీగా పర్యటించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ ఇండియా వేదిక అధికారంలోకొస్తేనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తుందన్నారు. బిజెపి పదేళ్ల అధికారంలో ఉన్నా ఒరిగిం దేమీ లేదన్నారు. ప్రభుత్వ ఆస్తులను ప్రయివేటీకరణ చేస్తున్న బిజెపిని గద్దె దించాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు.


ప్రచారం చేస్తున్న అభ్యర్థులు లావణ్య, నోబుల్

వైసిపి మేనిఫెస్టో రాష్ట్రానికి దిక్సూచి

వైసిపి ఎంపీ, ఎంఎల్ఎ అభ్యర్థులు ఉమాబాల, శ్రీరంగనాథరాజు

ప్రజాశక్తి - ఆచంట

సిఎం జగన్ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో రాష్ట్రానికి దిక్సూచి వంటిదని నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థి శ్రీరంగనాథరాజు అన్నారు. తూర్పుపాలెంలో వైసిపి మేనిఫెస్టో ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఆచంట నియోజకవర్గంలో ఎన్నికల ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పోడూరు మండలం తూర్పుపాలెం క్యాంపు కార్యాలయం నుంచి పండితవిల్లూరు, పోడూరు, కవిటం, గుమ్ములూరు మీదుగా ఆచంట మండలం ఆచంట వేమవరం, పెనుమంచిలి, కందరవల్లి, కరుగోరుమిల్లి, వల్లూరు, భీమలాపురం, కోడేరు, పెదమల్లం, కొడమంచిలి మీదుగా, ఆచంట గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు. ఆయా గ్రామాల్లో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గుబ్బల తమ్మయ్య, గూడూరు పెద్దరాజు, చిల్లే లావణ్య, సుంకర సీతారామ్, జక్కంశెట్టి చంటి, కోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న ఎంపీ అభ్యర్థి ఉమాబాల, ఎంఎల్ఎ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

అభివృద్ధి, సంక్షేమమే టిడిపి కూటమి ఎజెండా

మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు

ప్రజాశక్తి - నరసాపురం

అభివృద్ధి, సంక్షేమమే టిడిపి కూటమి ఎజెండా అని మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు అన్నారు. జనసేన నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్‌ను గెలిపించాలని కోరుతూ పట్టణంలోని 26వ వార్డులో మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు, నాయకర్ సతీమణి సునీత, కుమార్తె శ్రీయ ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవనాయుడు మాట్లాడుతూ అన్నివిధాలుగా వెనుకపడిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టగలిగే సామర్థ్యం చంద్రబాబుకే ఉందన్నారు. అవినీతి రహిత పాలన అందించాలంటే టిడిపి కూటమిని గెలిపించాలని కోరారు. పవన్ ఆశయాలు, చంద్రబాబు అనుభవం రాష్ట్రానికి ఎంతో అవసరమన్నారు. బొమ్మడి సునీత మాట్లాడుతూ తన భర్త బొమ్మిడి నాయకర్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఘంటా కృష్ణ, శిరిగినీడి రాజ్యలక్ష్మి, కొల్లు పెద్దిరాజు, కోటిపల్లి వెంకటేశ్వరరావు, గాది ఆదిబాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బండారు మాధవనాయుడు

పితాని కోడలు నాగసాహితీ ప్రచారం

ప్రజాశక్తి - పెనుమంట్ర

టిడిపి ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థి పితాని సత్యనారాయణను గెలిపించాలని ఆయన కోడలు నాగసాహితీ కోరారు. మండలంలోని సోమరాజు ఇల్లింద్రపర్రు, మల్లిపూడి గ్రామాల్లో ఆదివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో టిడిపి కూటమిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల ద్వారా మహిళలకు లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రతి గ్రామంలోనూ మౌలిక సదుపాయాలు, తాగునీటి వసతులు కల్పించడమే ప్రధాన ధ్యేయంగా పితాని సత్యనారాయణ కృషి చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి సానబోయిన సూర్యకాంతం, ఎంపిటిసి సభ్యులు దండు నాగమణి, మాధవి లత పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న పితాని కోడలు నాగసాహితీ

చలివేంద్రాన్ని ప్రారంభించిన బడేటి చంటి

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరులోని టౌన్ గాంధీ మైదానం వద్ద మధ్యాహ్నపు అనసూయమ్మ జ్ఞాపకార్థం మధ్యాహ్నపు బలరాం కుటుంబ సభ్యులు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఆ చలివేంద్రాన్ని టిడిపి ఏలూరు ఎంఎల్‌ఎ అభ్యర్థి బడేటి రాధాకృష్ణ (చంటి) ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు, ఎంఆర్‌డి గ్రూప్ అధినేత మధ్యాహ్నపు రామకృష్ణదాస్, మధ్యాహ్నపు ఈశ్వర బలరాం, మధ్యాహ్నపు ధనుంజయరావు, కంచన రామకృష్ణ, విటాల చంద్రశేఖర్, వీరంకి త్రినాథ్, భారత వెంకట్రావు, కృష్ణమోహన్, మధ్యాహ్నపు నాని, జనసేన, టిడిపి నాయకులు, ఎంఆర్‌డి అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా పృథ్వి పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి -ముదినేపల్లి

వైసిపి మండల సోషల్ మీడియా కన్వీనర్ పేర్ని పృథ్వి పుట్టినరోజు వేడుక ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు కోడలు దూలం స్వాతి వైసిపి ముదినేపల్లి నాయకులతో కలిసి పుట్టినరోజు వేడుకలో పాల్గొన్నారు. అనంతరం ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ కార్యాలయంలో కేక్ కట్ చేసి పృథ్వికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

ప్రజాశక్తి - మొగల్తూరు

జనసేన నరసాపురం ఎంఎల్‌ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ అఖండ మెజార్టీతో విజయం సాధించనున్నారని మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవనాయుడు అన్నారు. కొత్తోట గ్రామ మాజీ సర్పంచి పడవల గంగరాజు అనుచరులతో జనసేన పార్టీలోకి చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవనాయుడు మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో టిడిపి కూటమి విజయం సాధించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షులు మేడిది బాబ్జి, సర్పంచులు మేడిది సౌజన్య ప్రభాకర్, పులపర్తి సూర్యనారాయణ, నాయకర్ సతీమణి సునీత, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ప్రభుత్వ భవనం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని చింతపర్రు గ్రామంలో ఉద్యోగులు, సందర్శకులతో కళకళలాడిన ప్రభుత్వ భవనం ప్రస్తుతం మూసివేసి కళా విహీనంగా తయారైంది. గతంలో సచివాలయాన్ని ఈ భవనంలోనే నడిపించారు. అదే గ్రామంలో కొత్త సచివాలయం నిర్మాణం పూర్తి కావడంతో సిబ్బంది సామగ్రిని అక్కడికి తరలించి అక్కడి నుంచే తమ సేవలను అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ భవనం నిరుపయోగంగా ఉంది. భవనం చుట్టూ చెత్తాచెదారాలు పేరుకుపోయి శుభ్రత లేకుండా ఉంది. ప్రజలకు అవసరమయ్యే విధంగా ఈ భవనాన్ని వినియోగించేలా చర్యలు తీసుకుని ప్రజల ఆస్తిని కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇలా ఎందుకు పనికి రాకుండా నిరుపయోగంగా వదిలేస్తే భవనం త్వరలోనే పాడైపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.లక్షల ఖర్చుపెట్టి నిర్మించిన భవనాన్ని ఈ రకంగా నిర్వీర్యం చేయడం ఎంతవరకు సమంజసమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనం

వైసిపితోనే సంక్షేమం, అభివృద్ధి

నరసాపురం ఎంఎల్‌ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం

అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మళ్లీ వైసిపి ప్రభుత్వం రావాలని ప్రభుత్వ చీఫ్ విప్, ఎంఎల్‌ఎ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని పసలదీవి గ్రామంలో ప్రజ ఆశీర్వాద ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశామన్నారు. తమను తిరిగి గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు. స్థానిక పదో వార్డులో ప్రజ ఆశీర్వాద ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రసాదరాజు సతీమణి ముదునూరి శారదవాణి ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం చేపట్టారు.

ప్రచారంలో వైసిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు

పాలకోడేరులో ఉచిత గుండె వైద్య శిబిరం

పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరులో పిఎంసి కళాశాలలో ఆదివారం పాలకోడేరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హెల్ప్ లయన్స్ హాస్పిటల్ విజయవాడ యాజమాన్యంచే ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు సుకుమార్, డాక్టర్ సతీష్, డాక్టర్ లయన్ బత్తిన వెంకటేశ్వరరావు రోగులను పరీక్షించారు. ఇసిజి, ఇసిహెచ్ఒ పరీక్షలు ఉచితంగా చేశారు. భీమవరం ప్రముఖ మెడికల్ స్టోర్ యాజమాన్యం బిద్రి రోగులకు అవసరమైన మందులను ఉచితంగా అందించారు. వైద్య శిబిరం నిర్వహించిన హెల్ప్ లయన్ హాస్పటల్ సిబ్బందిని, ఉచితంగా మందులు అందించిన బిద్రిని, లయన్స్ క్లబ్ సభ్యులను, కళాశాల యాజమాన్యం, గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ పాలకోడేరు మండలం సభ్యులు ఈ కార్యక్రమానికి సహకరించిన గ్రామస్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ప్రముఖ వైద్యులకు, కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి, లయన్స్ క్లబ్ తరఫున చిరు సత్కారాన్ని అందించారు. మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన కళాశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ క్లబ్ ఆఫ్ పాలకోడేరు మండలం తరపున బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు,పరిసర గ్రామాల ప్రజలు, పాలకోడేరు లయన్స్ క్లబ్ సభ్యులు, వైద్య సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ ర్యాలీ

ప్రజాశక్తి - పాలకొల్లు

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణ కాంగ్రెస్ కార్యాలయం గాంధీభవన్ నుంచి 29వ తేదీ సోమవారం భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు యడ్ల శివాజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నరసాపురం ఎంపీ అభ్యర్థి కెబిఆర్.నాయుడు, పాలకొల్లు ఎంఎల్‌ఎ అభ్యర్థి కొలుకులూరి అర్జున్‌రావు పాల్గొంటారని చెప్పారు. ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమై ఎర్ర వంతెన గాంధీ బొమ్మల సెంటర్ మున్సిపల్ ఆఫీస్ రోడ్డు మీదుగా యలమంచిలి మండలం కొంతేరు మీదుగా ర్యాలీ బయలుదేరి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని తెలిపారు. కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

కాళీపట్నం తూర్పులో నాయకర్ ప్రచారం

ప్రజాశక్తి - మొగల్తూరు

నర్సాపురం నియోజకవర్గంలో జనసేన జెండా ఎగరేయటం ఖాయమని ఆ పార్టీ ఎంఎల్‌ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ అన్నారు. ఆదివారం మండలంలోని కాళీపట్నం తూర్పులో మనకోసం మన దగ్గర కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి జనసేన ఎన్నికల మేనిఫెస్టో ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మేడిది బాబ్జి, ప్రభాకర్ ఉన్నారు.

'పింఛన్ల పంపిణీలో దుష్ట రాజకీయాలు మానుకోవాలి'

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సామాజిక పింఛన్ల పంపిణీలో సైతం కుట్ర రాజకీయాలకు పూనుకున్న వైసిపి ప్రభుత్వం ఆ నెపాన్ని టిడిపి అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కళ్యాణ్‌లపై నెట్టి రాజకీయంగా పబ్బం గడుపుకోవాలని చూడడం సరికాదని, ఇప్పటికైనా ఆ పార్టీ నేతలు తమ పద్ధతి మార్చుకోవాలని టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, ఏలూరు ఎంఎల్‌ఎ అభ్యర్థి బడేటి చంటి అన్నారు. ఏలూరు పవర్‌పేటలోని టిడిపి కార్యాలయంలో ఆదివారం జరిగిన ప్రెస్‌మీట్‌లో మే1వ తేదీనే పింఛన్లు పంపిణీ చేయాలంటూ రూపొందించిన పోస్టర్లను వారు ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఆర్థికంగా తిరోగమన బాట పట్టించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన అసమర్థతను కప్పి పుచ్చుకునేందుకు సామాజిక పింఛన్ల పంపిణీలో దుర్మార్గపు విధానాలకు తెర తీశారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బుజ్జగింపులు.. ప్రలోభాలు..

(మొదటి పేజీ నుంచి)

తుది జాబితాలో పేరు ఉండనుంది. ఒక్కరోజు మాత్రమే సమయం ఉండడంతో నాయకులు తమ ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. సోమవారం ఎంతమంది విత్‌డ్రా చేసుకుంటారో.. ఎంతమంది బరిలో నిలుస్తారో చూడాల్సి ఉంది.

భానుడి భగభగ..

(మొదటి పేజీ నుంచి)

ఇంకెలా ఉంటుందోనని జనం బెంబేలెత్తిపోతున్నారు.

ఆదాయం అంతంత మాత్రమే..

దూది రాంబాబు, సోడాల వ్యాపారి, ఆచంట

కుటుంబమంతా కష్టించినా ఆదాయం అంతంత మాత్రంగానే ఉంది. 20 ఏళ్ల నుంచి సోడాల వ్యాపారం చేస్తున్నాను. వేసవి నాలుగు నెలలు మాత్రమే మంచి ఆదాయం వస్తుంది. ఆ తర్వాత కుటుంబ పోషణ భారంగానే ఉంటోంది. సోడా వ్యాపారం చేసే వారికి బ్యాంకు నుంచి రుణాలు అందించాలి. మార్కెట్లో ప్రస్తుతం రకరకాల డ్రింకులు రావడంతో సోడాల అమ్మకాలు తగ్గాయి. దీంతో కుటుంబ పోషణ భారంగా ఉంది.

బేరాల్లేవు..

చోడాబత్తుల శ్రీనివాస్, కొబ్బరి వ్యాపారి, ఆచంట

ఎండలు పెరుగుతున్న కొద్దీ వ్యాపారాలు సన్నగిల్లాయి. బేరాల్లేక ఖాళీగా ఉంటున్నాం. మధ్యాహ్నం 12 గంటల నుంచి రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉంటున్నాయి. కొబ్బరి వ్యాపారం బాగుంటుందని దిగితే కనీసం రోజుకు రూ.500 కూడా రావడం లేదు. ఇలాగైతే మా కుటుంబాలు ఎలా గడుస్తాయి.

పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

(మొదటి పేజీ నుంచి)

ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వెలెన్స్ టీమ్, అకౌంటింగ్, సెక్టోరల్ అధికారులు, బిఎల్‌ఒలు, పోలీస్, అత్యవసర సేవల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ పొందేందుకు అర్హులన్నారు. ఫారమ్-12 దరఖాస్తులను పూర్తిచేసి ఎన్నికల డ్యూటీ సర్టిఫికేట్, ఆధార్ కార్డు జిరాక్స్, ఓటర్ గుర్తింపు కార్డు జిరాక్స్ కాపీలను జతచేసి సంబంధిత ఎఆర్ఒకు అందజేయాలన్నారు. వాటిని అధికారులు వారి సొంత నియోజకవర్గానికి పంపడం జరుగుతుందన్నారు. ఒక జిల్లాలో విధుల్లో ఉన్న ఉద్యోగికి మరో జిల్లాలో ఓటు ఉంటే తాను పనిచేస్తున్న జిల్లా కేంద్రంలోని ఫెసిలిటేషన్ సెంటర్లో ఈ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఇదే నిబంధన నియోజకవర్గాలకు కూడా వర్తిస్తుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి మే 6 నుంచి 8 వరకు తేదీగా ఎన్నికల సంఘం ప్రకటించిందన్నారు. ఇలా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఉద్యోగికి ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ఉద్యోగులకు ప్రత్యేకంగా ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగం ఏ తేదీన, ఏ విభాగం అధికారులు, సిబ్బంది ఓటు వేయాలో శాఖాధిపతుల ద్వారా తెలియజేయడం జరుగుతుందన్నారు. పోస్టల్ బ్యాలెట్లను కూడా ఇవిఎంలతో పాటు మాత్రమే లెక్కించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

నామినేషన్ల ఉపసంహరణ తరువాత చర్యలు వేగవంతం

(మొదటి పేజీ నుంచి)

నామినేషన్ ఉపసంహరణ ప్రక్రియను, తర్వాత చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయాలన్నారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్య, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కర్‌రావు, జిల్లాలోని నియోజకవర్గాల నుంచి రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న బాబ్జి

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని, కాంగ్రెస్ తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థి మర్నీడి బాబ్జి తెలిపారు. ఆదివారం తాడేపల్లిగూడెం పట్టణంలోని హౌసింగ్ బోర్డ్, మిలటరీ కాలనీ, గణేష్ నగర్ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ అధికారంలోకి రాగానే రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పిస్తామన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కావాలన్నా, రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నా కాంగ్రెస్ అధికారంలోకి రావాలని కోరారు. దశాబ్దాల నాటి చరిత్ర ఉన్న పార్టీ ప్రజల కోసం ఎన్నో చేసిందని ఆయన గుర్తు చేశారు. గడచిన ఐదు సంవత్సరాల కాలంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ఏమాత్రం అభివృద్ధి జరిగిందో ప్రజలు గమనిస్తున్నారన్నారు. సామాన్యుడిగా అడుగుతున్నాను ఒక్క అవకాశం ఇవ్వండి అని బాబ్జి విజ్ఞప్తి చేశారు.

నిర్మానుషంగా ఉన్న రహదారి

ఎండ వేడిమితో రహదారులు నిర్మానుష్యం

ప్రజాశక్తి - మొగల్తూరు

అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో రహదారులు నిర్మానుషంగా మారాయి. మే నెల ఆరంభం కాకుండానే ఎండలు భగ్గుమంటున్నాయి. ఉదయం 9, 10 గంటలు దాటేసరికే ఉష్ణోగ్రతలు పెరగడంతో రహదారిపైకి వచ్చేందుకు ప్రజలు భయపడుతున్నారు. సాయంత్రం నాలుగు గంటల వరకు కూడా ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. దీంతో రహదారులు జనసంచారం లేక నిర్మానుషంగా మారుతున్నాయి. వ్యక్తిగత, కుటుంబ అవసరాల నిమిత్తం ప్రజలు ఉదయం, సాయంత్రం వేళలో మాత్రమే బయటకు వస్తున్నారు.

'కూటమి విజయానికి కృషి చేయాలి'

ప్రజాశక్తి - పెనుగొండ

టిడిపి, జనసేన, బిజెపి కూటమి అధికారంలోకి రావడానికి కార్యకర్తలందరూ కృషి చేయాలని బిజెపి నరసాపురం పార్లమెంట్ అభ్యర్థి శ్రీనివాస వర్మ అన్నారు. ఆదివారం పెనుగొండ మండలం సిద్ధాంతం సుబ్బరాజు కళ్యాణ మండపంలో ఆచంట నియోజకవర్గ కార్యకర్త పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అన్నీ కేంద్ర పథకాలని వైసిపి ప్రభుత్వాన్ని విమర్శించారు. ఈ సమావేశంలో పితాని మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను వైసిపి ప్రభుత్వం నాశనం చేసిందని, ఈ సైకో ప్రభుత్వాన్ని ఓడించడానికి తామంతా కూటమిగా ఏర్పడ్డామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిల్లి సత్తిరాజు, పెనుగొండ సర్పంచి శ్యామల సోనీ, చింతపల్లి గణరాజు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి - గణపవరం

బహుమతులు అందజేస్తున్న సభ్యులు

చలివేంద్రాలు వేసవిలో దాహార్తిని తీర్చడానికి ఉపయోగపడతాయ, గణపవరంలో మానవతా ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని పలువురు కొనియాడారు. ఆదివారం మండల కేంద్రమైన గణపవరంలో మానవతా సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మానవ సంస్థ జిల్లా అధ్యక్షులు తాడేపల్లి మోహన్ మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలతో పాటు వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలోనే పదో తరగతి పరీక్షల్లో గణపవరం, నిడమర్రు మండలంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, నగదుతో పాటు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని మానవతా సంస్థ జిల్లా నాయకులు కాకర్ల వినాయక, నాగ వీర నాగయ్య ఆర్థిక సహకారంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంట అన్నారం, ఆర్ఎస్.రాజు, సిహెచ్.నాగేశ్వరరావు, సంకు శ్రీనివాసరావు, నౌడు అచ్చారావు, ముత్యాల సూరిబాబు, ఎస్.శంకరం, సుబ్బారావు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి విడనాడాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి - నరసాపురం

ఉద్యోగులు, కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ఉదాసీన వైఖరిని విడనాడాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ అన్నారు. స్థానిక మీరా గ్రంథాలయంలో సిఐటియు ఆధ్వర్యంలో ఆశా వర్కర్ల జనరల్ బాడీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి యూనియన్ నాయకులు ఎస్‌కె.బేగం, ఆదిలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతుల్లో రెండు దశాబ్దాల నుంచి ఉద్యోగ భద్రత లేకుండా, కనీస వేతనం లేకుండా జీవితాలను సాగిస్తున్న ఉద్యోగుల పట్ల ప్రభుత్వాలు పట్టనట్టు వ్యవహరించడం తగదన్నారు. ఉద్యోగుల ప్రయోజనాల కోసం పాటుపడే రాజకీయ పార్టీలను గెలిపించుకోవాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు వారి జీవన స్థితిగతులను మెరుగుపడే విధంగా ఎన్నికలలో ఏ పార్టీ ఎజెండాను ముందుకు తీసుకురాలేదన్నారు. కార్మికవర్గ ప్రయోజనాల కోసం కృషి చేసే పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత అసంఘటిత రంగ కార్మికులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, ఆశ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బిజెపి, పొత్తు పార్టీలను ఓడించాలి

యూనియన్ జిల్లా కార్యదర్శి బి.వాసుదేవరావు

ప్రజాశక్తి - ఆకివీడు

పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసిన బిజెపి, ఎన్‌డియే కూటమిని, వాటికి రాష్ట్రంలో వంత పాడుతున్న వైసిపిని రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని రైస్ మిల్ కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి బి.వాసుదేవరావు పిలుపునిచ్చారు. ఆస్థానంలో కార్మికుల రక్షణ కోసం పోరాడుతున్న కాంగ్రెస్ బ్లాక్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆదివారం సాయంకాలం స్థానిక రైస్ మిల్లర్ అసోసియేషన్ హాల్లో రైస్ మిల్లు కార్మిక ముఠా మేస్త్రిలతో మే డే కార్యక్రమ సన్నాహక సమావేశం యూనియన్ నాయకులు తమ్మిశెట్టి కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వాసుదేవరావు పాల్గొని మాట్లాడుతూ పది సంవత్సరాల నుంచి బిజెపి కార్మికులకు పనికొచ్చే పని ఒక్కటీ చేయలేదని, ఉన్న చట్టాలను కూడా రద్దు చేశారని విమర్శించారు. ఫలితంగా కార్మికులకు పని లేకుండా చేశారని తెలిపారు. మే డే సందర్భంగా వాడ వాడలా సిఐటియు జెండాలు ఎగురవేసి సభలు, ప్రదర్శనలో కార్మికులందరూ పాల్గొని ఐక్యతను చాటాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెంకె అప్పారావు, కె.తవిటి నాయుడు, బొర్ర శీను, ముద్దే తవ్విటయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వాసుదేవరావు

గణపవరం: మే ఒకటో తేదీన కార్మిక దినోత్సవం సందర్భంగా జరిగే మేడే కార్యక్రమాన్ని మండలంలో అన్ని గ్రామాల్లో జయప్రదం చేయాలని సిఐటియు మండల కమిటీ అధ్యక్షులు పి.గోవిందు, ఎం.పెంటారావు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. మే డే సందర్భంగా గ్రామాల్లో సిఐటియు పతాకాలు ఆవిష్కరించి మే డే విశిష్టతను ప్రజలకు వివరించాలని చెప్పారు.

మానవత ఆశయం గొప్పది

ఎంఇఒ లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆర్థికసాయం చేస్తున్న మానవత సభ్యులు

విద్యార్థి దశ నుంచే మానవత విలువలు బోధించాలనే మానవత ఆశయం చాలా గొప్పదని, సమాజానికి వారు చేస్తున్న సేవలు అభినందనీయమని మండల విద్యాధికారి లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలో మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన నెలవారి సమావేశంలో 10వ తరగతిలో మండల స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మార్టేరు రోటరీ హాల్‌లో సత్కరించారు. బాణాల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన నెలవారీ సమావేశానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కోరారు. అనంతరం తాడి రాణి, సౌమ్యా రెడ్డి జిల్లా పరిషత్ పాఠశాల పెనుమంట్ర, సత్తి మాధవి లత, ఎస్‌విజి హైస్కూల్ మార్టేరు, సానబోయిన హర్షవర్ధన్ గురుకుల పాఠశాల మార్టేరు, ఈతకోట గీత ప్రవళిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జుత్తిగ ఎ.మాన్విత విజయ ఇంగ్లీష్ మీడియం స్కూల్ పెనుమంట్ర, పెసల లక్ష్మీ నాగ సహస్ర విద్యార్థి స్కూల్ మార్టేరు, వై.మోహన ప్రియ విద్యార్థి స్కూల్ మార్టేరులను మానవతా కమిటీ సభ్యులు సత్కరించారు. కిడ్నీ వ్యాధి బాధిత పేద బ్రాహ్మణునికి రూ.15 వేల ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. అనంతరం రాజమండ్రి నుంచి వచ్చిన శాంతి హాస్పిటల్ వైద్యులచే ఉచిత చెవి, ముక్కు, గొంతు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సుమారు 110 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొత్త సత్యనారాయణమూర్తి, మండల కార్యదర్శి బండి ప్రసాద్, మండల కోశాధికారి శ్రీనివాసులు, మురళీకృష్ణ, ఆత్మీయ సహకార కమిటీ ఛైర్మన్ చిర్ల శ్రీనివాస్ రెడ్డి, కమిటీ సభ్యులు పడాల రామచంద్రారెడ్డి, చదువుల నరేంద్ర, చిర్ల వంశీరెడ్డి, పూర్వ ప్రెసిడెంట్ కడలి సుబ్రమణ్యం, వైస్ ప్రెసిడెంట్ కర్రి కృష్ణరెడ్డి, జాయింట్ సెక్రటరీ దొంగ జయ దుర్గారావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన వారికి కడలి సుబ్రహ్మణ్యం అల్పాహారం అందజేశారు. ఉచిత వైద్యశిబిరంలో స్థానిక కోడేరు రోడ్డులో ఉన్న సంజీవని జనరిక్ మెడికల్ స్టోర్ వారు రూ.5 వేల విలువ గల మందులు ఉచితంగా అందజేశారు.

ప్రతిభా విద్యార్థులతో ఆదిత్య స్కూల్ యాజమాన్యం

విద్యార్థులకు సత్కారం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరంలో అనేక కార్పొరేట్ స్కూల్స్ వస్తున్నా మాపై తల్లిదండ్రులు ఉంచిన నమ్మకాన్ని నిలబెడుతూ, గత 27 ఏళ్లుగా అత్యుత్తమ విద్యను అందిస్తున్నామని స్కూల్ ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్ అన్నారు. పదో తరగతి ఫలితాల్లో అద్భుత విజయం సాధించిన భీమవరం ఆదిత్య స్కూల్ విద్యార్థులకు అభినందన, సత్కార కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. జి.మనస్విని 592, టి.లక్ష్మి ప్రశీధ 588, ఎస్‌డి ఆయూబ్ 587, బి.పౌర్ణమి 586, జె.కార్తీక దేవి 586, వై.హర్షిత 578 మార్కులతో ప్రతిభ చాటుకున్నారు. 10 సంవత్సరాలకు పైబడి చదివిన విద్యార్థులకు మెమెంటో, శాలువ, విఐపి సూట్ కేస్, ట్రాలీలతో స్కూల్ డైరెక్టర్, లయన్ ఆదిత్య కృష్ణంరాజు సత్కరించారు. విద్యార్థులు తమ జీవితంలో సాధించిన మొట్టమొదటి విజయానికి గుర్తింపునిస్తూ వారి జీవితాంతం గుర్తుండేలా మరిన్ని విజయాలు సాధించడానికి ప్రోత్సాహంగా చిరు సన్మానం చేశామని కృష్ణంరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ బోర్డు కాలనీ బ్రాంచి ప్రిన్సిపల్ కెవి.సత్యనారయణ, బి.యుగసుధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో జరిగిన ఆర్యవైశ్యుల, వర్తకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన జరగడం, నూతనంగా ఏర్పడిన పశ్చిమగోదావరి జిల్లాకు భీమవరంను కేంద్రంగా తీసుకు రావడం జరిగిందన్నారు. తాను జిల్లా కేంద్రం కోసం మంత్రి పదవిని సైతం త్యాగం చేసానంటే దానికి కారణం భీమవరం నియోజకవర్గం రాష్ట్ర స్థాయిలోనే అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలనే ఆశతోనే అని అన్నారు. అంతేకాకుండా ఈ 58 నెలల కాలంలో భీమవరం పట్టణాన్ని శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేయడంలో విజయం సాధించామని తెలిపారు. ముఖ్యంగా పట్టణ ప్రజలకు కోటి లీటర్ల మంచినీటి సామర్థ్యాన్ని రెండు కోట్ల 80 లక్షల లీటర్ల వరకు పెంచి తాగునీటికి ఇబ్బంది లేకుండా చేయడం జరిగిందన్నారు. 2053 సంవత్సరాన్ని లక్ష్యంగా చేసుకుని పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని అమృత పథకం మూడో విడత రూ.48 కోట్ల నిధులను మంజూరు చేయించి, చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు. వచ్చే నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో మరోసారి తనను, ఎంపీగా పోటీలో ఉన్న గూడూరి ఉమాబాలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గూడూరి జగదీష్, మానేపల్లి నాగన్న బాబు, కురిసేటి కాశి, వబిలి శెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పిరమిడ్ ధ్యానంతో ఆరోగ్యం

పెనుమంట్ర: పిరమిడ్ ధ్యానం చేయడం వల్ల అందరికీ సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని డాక్టర్ బ్రహ్మర్షి పితామహా ప్రతీజీ అన్నారు. మండలకేంద్రం పెనుమంట్ర గ్రామంలో ఆదివారం భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు, సాయిగీతలచే నిర్మించిన జగద్గురు డాక్టర్ బ్రహ్మర్షి పితా మహ పత్రిజీ పిరమిడ్ ధ్యాన మందిరం వద్ద కృష్ణాజిల్లా మట్టగుంట గ్రామానికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ టి.బ్రహ్మాం విశేష జ్ఞానబోధతో ధ్యానశిక్షణ కార్యక్రమం అద్భుతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మాం మాట్లాడుతూ శ్వాస మీద ధ్యాస ఉంచి ధ్యానం చేయాలని తెలిపారు.

ప్రచారంలో బండి వెంకటేశ్వరరావు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

సిపిఐ ఎంఎల్ఎ అభ్యర్థి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నగరాభివృద్ధితో పాటు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ఇండియా వేదికను గెలిపించాలని సిపిఐ ఏలూరు ఎంఎల్ఎ అభ్యర్థి బండి వెంకటేశ్వరారవు అన్నారు. స్థానిక పత్తేబాద, చాణిక్యపురి కాలనీ తదితర ప్రాంతాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి షాపునకు తిరిగి ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా బండి వెంకటేశ్వరావు మాట్లాడుతూ నగరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు, టిడ్కో ఇళ్ల నిర్మాణం, పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ, నగరంలో విలీనమైన ఏడు పంచాయతీల్లో మౌలిక వసతుల సదుపాయం, మూతపడిన జ్యూట్‌మిల్లులను తెరిపించడం వంటి కార్యక్రమాలు చేపడతానన్నారు. పిసిపి జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఇండియా వేదిక అభ్యర్థులు బండి వెంకటేశ్వరావను అసెంబ్లీకి, కావూరి లావణ్యను పార్లమెంటుకు ఎన్నుకుంటే ఎపికి ప్రత్యేక హోదా సాధించటం, పోలవరం నిర్మాణం పూర్తి చేయడం వంటి కార్యక్రమాలు చేస్తారని చెప్పారు. సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ కరెంట్ ఛార్జీలను విపరీతంగా పెంచి ప్రజలపై మోయలేని భారాలు వేసిందన్నారు. రైతులు, కార్మికులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలు తీసుకొచ్చిందన్నారు. దేశంలో రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని, సిపిఎం నాయకులు ఇస్సాకు, సత్యనారాయణ పాల్గొన్నారు.

రూ.13.96 కోట్ల విలువైన నగదు, బంగారం, మద్యం స్వాధీనం

కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇఎస్ఎంఎస్ కింద చేబట్టిన సీజర్ మేనేజ్‌మెంట్ ప్రక్రియ ద్వారా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకూ జిల్లా వ్యాప్తంగా మొత్తంగా రూ.13.96 కోట్ల విలువైన నగదు, బంగారం, మద్యం, ఇతర వస్తువులు సీజ్ చేశామని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ తెలిపారు. ఇందులో రూ.2,10,30 వేల లక్షల నగదు, రూ.10.17 కోట్ల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, రూ.1,69,20 వేల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ/ఎన్ కోర్ ద్వారా అందిన అభ్యర్థనల్లో ఇప్పటివరకు 2162 అనుమతులు ఇచ్చినట్లు చెప్పారు. ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ ద్వారా 2255 అభ్యర్థనలు రాగా వాటిలో ఇప్పటివరకు 2162 అనుమతులు జారీ చేయగా మరో 93 పరిశీలనలో ఉన్నాయన్నారు. సి-విజిల్ ద్వారా 439 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. మీడియాలో ఎన్నికల ఉల్లంఘనలకు వచ్చిన 114 ఫిర్యాదులు పరిష్కరించామన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున్న ప్రజలు నగదు, ఇతర విలువైన వస్తువులు ప్రయాణ సమయంలో తీసుకువెళ్లే సమయంలో అందుకు సంబంధించిన సరైన ఆధార పత్రాలను తమ వద్ద ఉంచుకోవాలని తెలిపారు.

రామకృష్ణంరాజు మాస్టారు సేవలు ఎనలేనివి

ఉభయగోదావరి జిల్లాల ఎంఎల్‌సి ఐవి

ప్రజాశక్తి - నరసాపురం

రామకృష్ణంరాజు మాస్టారు సేవలు ఎనలేనివని ఉభయగోదావరి జిల్లాల ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు(ఐవి) అన్నారు. చినమామిడిపల్లి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు రుద్రరాజు రామకృష్ణంరాజు ఉద్యోగ విరమణ ఆదివారం పట్టణంలోని అల్లూరి సత్యనారాయణ రాజు సాంస్కృతిక కేంద్రంలో నిర్వహించారు. ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇళ్ల వెంకటేశ్వరరావు విచ్చేసి మాట్లాడారు. రామకృష్ణంరాజు ఉపాధ్యాయ నేతగా 35 ఏళ్ల సేవ చేశారని గుర్తు చేశారు. బోధన ప్రథమ కర్తవ్యంగా భావించి రాజు మాస్టారు అందరి మన్ననలు అందుకున్నారన్నారు. 38

రామకృష్ణంరాజును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఏళ్లుగా వేలాది మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారన్నారు. అనంతరం యుటిఎఫ్ జిల్లా, మండల శాఖ ఆధ్వర్యంలో రామకృష్ణంరాజు దంపతులకు పూలమాలలు వేసి, ఘనంగా సన్మానించారు.

వినయం, క్రమశిక్షణ విజయానికి మూలం

డిఎంహెచ్‌ఒ కె.ఉమా మహేశ్వరరావు

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న వక్తలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వినయం, క్రమశిక్షణ విజయానికి మూలమని, విద్యార్థి దశ నుంచి ఒక లక్ష్యంతో ముందుకు సాగాలని జిల్లా వైద్యాశాఖాధికారి డాక్టర్ కె.ఉమామహేశ్వరరావు అన్నారు. భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాల్లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 84 మంది (24 పాఠశాలల) విద్యార్థులను సత్కరించి మెమోంటోలు, ప్రశంసాపత్రాలను అందించారు. ఈ సందర్భంగా భీమవరం ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ జి.బాలకృష్ణంరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంవి.రమణ, ఎస్ఆర్‌కెఆర్.ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు, రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.రామభద్రిరాజు మాట్లాడుతూ ప్రతిభకు పట్టం కట్టడం మన సంస్కృతి అని, 27 ఏళ్లుగా ప్రతిభావంతులను ప్రోత్సహిస్తూ సత్కరించడం అభినందనీయమని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో భీమవరం పట్టణ ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన 84 మంది విద్యార్థులను అభినందించి మెమోంటోలు, ప్రశంసాపత్రాలను అందించామన్నారు. భీమవరం లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో అరసవల్లి ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు అరసవల్లి సుబ్రహణ్యం, సిఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సకుమల్ల సత్యనారయణ, ఇన్నర్ వీల్ క్లబ్ గంధం శ్రీదేవీ, ఎస్‌కె.చాన్‌బాషా, కె.శిరీష, కలిగొట్ల గోపాల్‌శర్మ, విద్యార్థుల తల్లిదండ్రులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీరు రాక దళితుల అవస్థలు..

ప్రజాశక్తి - ముదినేపల్లి

పంచాయతీ కుళాయిల ద్వారా నీటి సరఫరా నిలిచిపోవడంతో దళితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని గురజ దళితవాడకు గత పది రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. గ్రామంలోని రక్షిత మంచినీటి పథకం నుంచి దళితవాడకు నీటి సరఫరా చేస్తున్నారు. పది రోజులుగా దళితవాడలోని కుళాయిలకు నీరు రావడం లేదని వాపోతున్నారు. గ్రామం అంతా నీరు సరఫరా చేస్తున్నా దళిత వాడకు ఎందుకు నిలిపివేశారంటూ దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో నీటి కోసం నానా అవస్థలు పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై అడిగేందుకు రక్షిత మంచినీటి పథకం వద్దకు వెళ్లి ట్యాంక్

గురజ మంచినీటి చెరువు

ఆపరేటర్ చలమయ్యను ప్రశ్నించగా పొంతన లేని సమాధానం చెబుతూ అక్కడనుంచి పారిపోయినట్లు దళితులు చెబుతున్నారు. మంచినీటి చెరువు పూర్తిస్థాయిలో నింపినప్పటికీ నీరు దళితవాడకు సరఫరా చేయకపోవడంలో అంతర్యం ఏమిటంటూ ప్రశ్నిస్తున్నారు. చెరువులో నీరు తక్కువగా ఉన్నప్పుడే తమ ప్రాంతానికి నీటి సరఫరా బాగా వచ్చేదని, మంచినీటి చెరువు పూర్తిస్థాయిలో నింపిన తరువాత తమ ఏరియాకు నీరు సరఫరా చేయకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ కార్యదర్శి, సర్పంచి జోక్యం చేసుకుని దళితవాడకు నీటి సరఫరా వెంటనే చేయాలని కోరుతున్నారు.

'వాగ్దానాలు అమలు చేయని బిజెపి'

తాడేపల్లిగూడెం: 2014లో అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకొచ్చిన బిజెపి పదేళ్లలో ఏమీ అమలు చేయలేదని సిపిఎం జిల్లా నాయకులు కర్రి నాగేశ్వరరావు అన్నారు. తాడేపల్లిగూడెం తాలూకా రైల్వే గూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం యూనియన్ కార్యాలయంలో సత్తి కోదండరామిరెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి నాగేశ్వరరావు హాజరై మాట్లాడారు. 2014లో బిజెపి అనేక వాగ్ధానాలు చేసి అధికారంలోకొచ్చిందన్నారు. ఆ వాగ్ధానాలఅన్నీ అమలు చేయకుండా ఈ పదేళ్ల పాటు పరిపాలన సాగించిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తానని, అమరావతి రాజధాని నిర్మిస్తానని, పోలవరం ప్రాజెక్టు జాతీయ ప్రాజెక్టుగా గుర్తిస్తామని, వెనకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తానని, గిరిజన యూనివర్సిటీలు నిర్మాణం చేస్తామని, రాష్ట్రానికి రెవెన్యూ లోటు భర్తీ చేస్తానని, కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణం చేస్తావని ఇలాంటి అనేక వాగ్ధానాలు చేసి అధికారంలోకొచ్చిన బిజెపి ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. పైగా కార్మికులు సాధించుకున్న కార్మిక చట్టాలను యజమానులకు అనుకూలంగా కార్మికులకు నష్టదాయకంగా మార్చిందన్నారు. వ్యవసాయ రంగానికి మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చి రైతాంగానికి తీరని ద్రోహం చేసిందన్నారు. అటువంటి బిజెపితో రాష్ట్రంలో టిడిపి, జనసేన ఉమ్మడిగా పోటీ చేయడం చాలా దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో ఇండియా వేదిక అభ్యర్థులకు వామపక్ష పార్టీలు, సిఐటియు శ్రేణులు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో చిర్ల పుల్లారెడ్డి, కర్రి సాయిరెడ్డి, ఆకుల నారాయణ, కడప ఆంజనేయులు, కర్రి సుబ్బిరెడ్డి, కర్రి శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్రావు, పత్రయ్య, ఎస్‌విఎస్ రెడ్డి కృష్ణ, నాని పాల్గొన్నారు.

ఎన్నికల పరిశీలకుల నియామకం

కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ఏలూరు: ఎన్నికల ప్రక్రియను పూర్తిస్థాయిలో పర్యవేక్షించేందుకు, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం జిల్లాకు ఎన్నికల పరిశీలకులను నియమించిందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్నవెంకటేష్ తెలిపారు. ఆయా నియోజకవర్గాల పరిధిలో ఏమైనా ఫిర్యాదులు ఉంటే వెంటనే ఫోన్ ద్వారా లేదా, ఆర్జీల రూపంలో ప్రజలు, రాజకీయ పార్టీలు సంబంధిత పరిశీలకులకు తెలియజేయవచ్చని చెప్పారు. వీరు బస చేసే ఏలూరు కలక్టరేట్ సమీపంలోని రెవెన్యూ గెస్ట్‌హౌస్‌లో ప్రతి రోజూ ఉదయం 11 గంటల లోపు సాయంత్రం ఐదు గంటల తరువాత ఆయా నియోజకవర్గాలకు సంబంధించిన పరిశీలకులకు ఫిర్యాదులు అందించవచ్చని తెలిపారు.

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి

భారత్ బచావో రాష్ట్ర వైస్ ఛైర్మన్ గూడూరు సీతామహాలక్ష్మి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ మస్తాన్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దేశంలో ప్రమాదకరంగా మారిన బిజెపి నియంతృత్వ పాలనను అడ్డుకోవాలంటే ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని భారత్ బచావో పిలుపు ఇచ్చింది. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా భారత్ బచావో రాష్ట్ర నాయకత్వ బృందం ఏలూరులో ఆదివారం పర్యటించింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో భారత్ బచావో రాష్ట్ర వైస్ ఛైర్మన్ గూడూరు సీతామహాలక్ష్మి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ మస్తాన్ మాట్లాడుతూ భారతదేశంలో గత పదేళ్లలో బిజెపి పరిపాలన పరిశీలిస్తే ప్రజాస్వామ్య హక్కులకు భంగం వాటిల్లిందన్నారు. విద్యా విధానంలో దేశ చరిత్రను వక్రీకరిస్తూ, కాశాయీకరణ తీసుకొచ్చిందని విమర్శించారు. అంబేద్కర్ రాసిన లౌకిక రాజ్యాంగాన్ని మత రాజ్యాంగంగా మార్చాలని బిజెపి ప్రయత్నిస్తుందన్నారు. బిజెపి ఎంపీలు ఎన్నికల ప్రచారంలో పార్లమెంట్‌లో అత్యధిక సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామని ప్రకటించడమే దానికి నిదర్శనమన్నారు. మణిపూర్, కర్ణాటక, ఢిల్లీ తదితర రాష్ట్రాల్లో మైనార్టీలపై దాడులు జరిగాయని, బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న కవులు, రచయితలు, ప్రొఫెసర్లను దేశద్రోహం పేరుతో అరెస్టు చేసి జైలులోకి నెట్టిందన్నారు. ప్రజలు తినే ఆహారం, కట్టుకునే బట్టలు, మాట్లాడే భాషలపై కూడా ఆర్‌ఎస్‌ఎస్ తన మనుధర్మ శాస్త్ర భావజాలాన్ని ప్రజలపై రుద్దాలని చూస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ప్రజాస్వామ్య హక్కులు పరిరక్షించడానికి, రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ప్రత్యామ్నాయ ప్రభుత్వం అవసరమన్నారు. ఇండియా వేదికగా ఏర్పడి పని చేస్తున్న కాంగ్రెస్, వామపక్ష పార్టీలను ఈ రాష్ట్రంలో ప్రజలంతా గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.రాజనాల రామ్మోహన్‌రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పి.కిషోర్, సిపిఐ ఏలూరు ఎంఎల్ఎ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు మాట్లాడారు.